

మైసూరు రోడ్డులో నేడు రాకపోకలు నిషేధం

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను పురస్కరించుకుని సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో రాకపోకలను నిషేధించారు. మైసూరురోడ్డు మసీదు ప్రాంతంలో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా వాహనాలు కట్టడి చేసినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మైసూరు రోడ్డు నుంచి మార్కెట్‌వైపు వచ్చే వాహనాలు విజయనగరవైపు వెళ్లేలా మళ్లించారు. టౌన్‌హాలు నుంచి మైసూరురోడ్డు వైపు వెళ్లే వాహనాలను జగ్జీవన్‌రామ్ నగర్ ట్యాంక్‌బండ్ రోడ్డువైపు వెళ్లేలా మళ్లించారు. బన్నేరుఘట్టరోడ్డులోనూ ఇదే తరహాలో వన్‌వే విధించారు.



ఉపాధ్యాయుల బదిలీకి... గ్రీన్ సిగ్నల్..!



- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఈ నెల 20 వరకు దరఖాస్తుకు అవకాశం
- జూలై 18న తుది జాబితా.. 24 నుంచి కౌన్సెలింగ్
- ఆరోగ్యశాఖలోనూ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీకి శనివారం షెడ్యూల్ ప్రకటించారు. బదిలీల కోసం వేచి ఉన్న వేలాదిమంది షెడ్యూల్ విడుదల కావడంతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన తరుణంలో ఈ ఏడాది డివిజన్లవారీ బదిలీలు వద్దని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం విన్నవించింది. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలకు అవకాశం ఉంది. జనరల్ కోటాలో బదిలీ కోరినవారికి, పరస్పరం బదిలీలు అవసరమని వినతులు పెట్టుకున్నవారికి, ఒకేపాఠశాలలో పదేళ్లపాటు విధులు నిర్వహించినవారికి తప్పనిసరిగా బదిలీలు చేస్తారు. ఏదైనా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఉపాధ్యాయులు ఎక్కువగా ఉంటే వారిని ఇతర ప్రాంతాలకు బదిలీలు చేస్తారు. తప్పనిసరి బదిలీలలో నగరాలు, పట్టణాలలో ఉండడం, నగరానికి 3 కిలోమీటర్లదూరంలో ఉన్న గ్రామాలు, నగరానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు బదిలీలు చేస్తారు. ఏదైనా నగరంలో పదేళ్లపాటు పనిచేసి ఉంటే వారికి పల్లె ప్రాంతాలకు బదిలీ చేస్తారు. పిల్లల విద్య, కుటుంబ, ఇతరత్రా కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. సాధారణంగా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే బదిలీల ప్రక్రియ కొనసాగిస్తారు. కానీ ఇటీవల లోక్‌సభ ఎన్నికలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో వాయిదా పడింది. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో జూన్‌లో కౌన్సెలింగ్ ప్రారంభించగా ప్రక్రియ ముగిసేందుకు మరో రెండు నెలల సమయం పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలో వెయ్యి కన్నడ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం కూడా ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అందుకు అనుగుణంగా బదిలీలు చేయనున్నారు. ఈనెల 20వరకు బదిలీలు కోరేవారు, పరస్పర బదిలీలకు దరఖాస్తుకు అవకాశం ఉంది. 27వరకు పరిశీలనలు చేస్తారు. 29న అంతర జిల్లా, జిల్లా వెలుపల అర్హుల జాబితాను ప్రకటిస్తారు. ఈనెల 29 నుంచి జులై 15వరకు అభ్యంతరాలకు అవకాశం ఉంది. జూలై 8న తాత్కాలికంగా ప్రాధాన్యత జాబితావిడుదల చేస్తారు. 10న ఖాళీ పోస్టుల వివరాలు ప్రకటిస్తారు. 18న తుది జాబితా వెలువరిస్తారు. జిల్లాలవారీగా కౌన్సెలింగ్ జరుపుతారు. జూలై 19న ప్రాథమిక, 20న హైస్కూల్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ కొనసాగనుంది. జూలై 24నుంచి 30వరకు ప్రాధాన్యత జాబితాలో ఉండేవారికి కౌన్సెలింగ్ ద్వారా చేరే అవకాశం ఉంటుంది.

ఆరోగ్యశాఖలోనూ కౌన్సెలింగ్ ద్వారానే..

వైద్య ఆరోగ్య శాఖలో ఈ ఏడాది కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేస్తామని ఆ శాఖ మంత్రి దినేశ్‌గుండూరావు ప్రకటించారు. గత ఏడాది కొత్తగా ప్రభుత్వం ఏర్పడినప్పుడు వేలాదిమంది డాక్టర్లతోపాటు సిబ్బంది బదిలీలకోసం డిమాండ్ చేశారని తెలిపారు. సాధారణ బదిలీలు చేసినా అందరి డిమాండ్లు సాధ్యం కాలేదన్నారు. బదిలీలల విషయంలో ఒత్తిళ్లు వచ్చాయని వివరించారు. 2016 నుంచి వైద్య ఆరోగ్యశాఖలో సమగ్రంగా బదిలీలు జరగలేదన్నారు. సాధారణ బదిలీల్లో అర్హులకు న్యాయం లభించదనే కారణంతో పూర్తిస్థాయిలో కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు అమలు చేయాలని సీనియర్ అధికారులకు సూచించామన్నారు. గ్రూప్ ఏ నుంచి డీ వరకు, డాక్టర్ల నుంచి సిబ్బంది దాకా కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేసేలా ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. జూలై నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ ముగుస్తుందన్నారు. ప్రభుత్వ కోటాలో వైద్య శిక్షణ పొందినవారు ఏడాదిపాటు తప్పనిసరి సేవలపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. మెరిట్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారానే ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పించారు. గతంలో ఈ విధానం రాష్ట్రంలో అమలులో ఉండేది. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ సేవ తప్పనిసరికాదని ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో ధర్మాసనం గ్రామీణసేవలను తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రభుత్వం స్పందించి కొత్తగా ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రైవేట్, డీమ్డ్, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో కోర్సులు ముగించిన విద్యార్థుల వివరాలను ప్రాధికారకు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థుల కొరత, పోస్టింగ్‌లు, సిఫారసులు వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ అధ్యక్షతన ఏడుగురు అధికారులతో ప్రత్యేక ప్రాధికారను ఏర్పాటు చేశారు.



దక్షిణాదిన కర్ణాటకలోనే తక్కువ

- పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సీఎం సమర్థన

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించడంతో ఆదాయం తగ్గిందని అందుకే ప్రస్తుతం ధరలు పెంచాల్సి వచ్చిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య సమర్థించుకున్నారు. ఆదివారం విజయపురలో మీడియాతో మాట్లాడుతూ డబుల్ ఇంజన్ ప్రభుత్వ పాలనలో పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించారని వివరించారు. కేంద్రప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా స్పందించలేదన్నారు. దీంతో రాష్ట్రవాటాగా ఆదాయం పెంచుకునేందుకు పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా పెంచాల్సి వచ్చిందన్నారు. దక్షిణాది రాష్ట్రాలను పరిశీలిస్తే కర్ణాటకలోనే పెట్రోల్, డీజిల్ ధరలు తక్కువగా ఉన్నాయన్నారు. దేశంలో ఆర్థికంగా బలిష్టమైన మహారాష్ట్ర కంటే కర్ణాటకలోనే తక్కువ అన్నారు. గుజరాత్, మధ్యప్రదేశ్‌లతో పోల్చినా తక్కువేనని తెలిపారు. కేంద్రప్రభుత్వం కన్నడిగులను మోసం చేసి ఎక్కువ పన్నులు వసూలు చేసిందన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు పెట్రోల్‌పై రూ.9.48, డీజిల్‌పై రూ.3.46 పన్ను ఉండేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పెట్రోల్‌పై రూ. 32.98, డీజిల్‌పై రూ.31.83 పెంచారన్నారు. పెట్రోల్‌పై కస్టమ్స్ ట్యాక్స్‌ను రూ. 13, డీజిల్‌పై రూ.16 తక్కువ చేశారని అన్నారు. ప్రస్తుతం పెట్రోల్‌పై కేంద్రం పన్ను రూ.19.9, డీజిల్‌పై రూ.18.8 ఉందన్నారు. కేంద్రం ప్రజలపై భారం పడకుండా ఉండేలా తగ్గించాల్సి ఉందన్నారు. తాము పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం ద్వారా వచ్చే ఆదాయంతో ప్రజాసేవ, అభివృద్ధికి ఖర్చు చేస్తామని అన్నారు. సమతుల్యత, బాధ్యతాయుతమైన పాలన సాగించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. కాగా, రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ విజయపురలో మీడియాతో మాట్లాడుతూ ఆదాయం తక్కువవుతోందని, అభివృద్ధి, గ్యారెంటీలకు నిధులు సమకూర్చుకునేందుకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాల్సి వచ్చిందన్నారు. అభివృద్ధి అవసరం లేదా అంటూ ప్రశ్నించారు. గ్యారెంటీలు అందరికీ ఇస్తున్నామని తెలిపారు. నిత్యావసరాల ధరల పెంపుపై ప్రధాని మోదీని ఎందుకు ప్రశ్నించరని బీజేపీని అడిగారు. బీజేపీ పాలనలో అన్ని వస్తువుల ధరలు పెరిగాయన్నారు. తాము అనవసరంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదన్నారు.

బస్సు చార్జీలు పెరిగే అవకాశం..?

డీజిల్ ధరలు పెరగడంతో బస్సు చార్జీలు పెంచాల్సిన అవసరం ఉందని నాలుగు కార్పొరేషన్‌ల నుంచి డిమాండ్ వచ్చినట్టు తెలుస్తోంది. రవాణా సంస్థలు 25-35 శాతం పెంచాలని భావిస్తుండగా ప్రభుత్వం అనుమతించే అవకాశం ఉందని సమాచారం.

సిద్దరామయ్య ఆచూకీ తెలపండి..!

- డీజీపీకి ప్రతిపక్ష నేత అశోక్ వినతి

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఎక్కడ ఉన్నారో గుర్తించి అప్పగించాలని, ఆయన కనిపించకుండా పోయారంటూ ప్రతిపక్షనేత ఆర్. అశోక్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్' ఖాతా ద్వారా డీజీపీకి లేఖ రాశారు. బీజేపీ పాలనలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినందుకు అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న సిద్దరామయ్య, డీకే శివకుమార్ ద్విచక్రవాహనాన్ని పాడె తరహాలో మోసుకుంటూ నిరసన ర్యాలీ చేశారని, ప్రస్తుతం వారే సీఎం, డీసీఎంగా ఉన్నారని ఇప్పుడెలా పెంచుతారని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే నిత్యావసరాలన్నింటిపైనా ప్రభావం చూపుతుందన్నారు. ఇదే విషయమై బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'బురుడె రామయ్య కాంగ్రెస్ లూట్స్ కర్ణాటక' అంటూ ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును ఖండిస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గ్యారెంటీల కోసం ప్రజలపై భారం మోపారని అన్నారు. ఇదే సందర్భంగా సిద్దరామయ్య, డీకే శివకుమార్ పాడె తరహాలో ద్విచక్రవాహనాన్ని మోసిన ఫైల్ ఫొటోను ప్రదర్శించారు. ఇదేనా చిత్తశుద్ధి అంటూ ప్రశ్నించారు.



మీడియా సమావేశంలో ప్రతిపక్షనేత అశోక్

రాహుల్ అడుగుపెడితే రాష్ట్రం నాశనమే..




ద్విచక్రవాహనాన్ని పాడె తరహాలో ఊరేగిస్తున్న సిద్దరామయ్య, డీకే శివకుమార్ (ఫైల్)

కర్ణాటకలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై బీజేపీ జాతీయ ఐటీ సెల్ ఇన్‌చార్జ్ అమిత్‌మాళవీయ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం 'ఎక్స్' ద్వారా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అడుగుపెట్టిన ప్రతిరాష్ట్రం నాశనమే అని ఆరోపించారు. గ్యారెంటీల కోసం ప్రజల నుంచి లూటీ చేసేలా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచేశారని ఆరోపించారు. ఇదే విషయాన్ని రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ అభిప్రాయాన్ని 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర ప్రభుత్వ అస్థిరతను గమనించాలన్నారు. కర్ణాటకలో ప్రభుత్వం దిశానిర్దేశం లేకుండా ముందుకు పోతోందన్నారు. భవిష్యత్తులో అధోగతికి కారణం కానుందన్నారు.

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్

- ఐటీ నగరిలో తొలి ప్రయోగం
- భవిష్యత్తులో మరిన్ని నిర్మాణాలకు అవకాశం

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 3ఐటీ నగరి బెంగళూరులో ఒకప్పుడు డబుల్ డెక్కర్ బస్సులు తిరిగేవి. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం డబుల్ డెక్కర్ బస్సులు నిలిచిపోయాయి. డబుల్ డెక్కర్ అనే పదమే లేకుండా పోయింది. నగరంలో మరోసారి డబుల్‌డెక్కర్ హల్‌చల్ చేస్తోంది. జయనగర్ రాగిగుడ్డ నుంచి సెంట్రల్ సిల్క్‌బోర్డు దాకా 3.3 కిలోమీటర్ల దూరం పాటు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ సిద్ధమైంది. ఒకటి రెండు రోజుల్లోనే ప్రజలకు అందుబాటులోకి రానుంది. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. తొలి అంతస్తు 8 మీటర్ల ఎత్తులో వాహనాల సంచారానికి వీలు కల్పించారు. దానిపై భాగాన 16 మీటర్ల ఎత్తున రెండో అంతస్తులో మెట్రో సంచారానికి నిర్మాణాలు జరిపారు. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే బెంగళూరు దక్షిణ వైపు నుంచి సిల్క్‌బోర్డు దాకా నిమిషాల వ్యవధిలో చేరుకునే అవకాశం ఉంటుంది. అక్కడి నుంచి నేరుగా వెళ్తే వైట్‌ఫీల్డ్‌వైపు, కుడివైపు తిరిగితే ఎలక్ట్రానిక్‌సిటీవైపు వెళ్లే అవకాశం ఉంది. హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్, బీటీఎం లే అవుట్ ప్రాంతాలకు వెళ్లేందుకు అనువైనది. సిలికాన్‌సిటీ బెంగళూరులో ఉదయం, సాయంత్రం రోడ్డుపై సంచారమంటే కష్టమైనదే. ప్రత్యేకించి సిల్క్‌బోర్డు సర్కిల్, రాగిగుడ్డ సర్కిల్‌లో ట్రాఫిక్ అత్యధికంగా ఉండేది. ఫ్లై ఓవర్ నిర్మాణంతో సులభతరమయింది. ఫ్లై ఓవర్‌పై వాహన సంచారం వన్‌వే కోసం అధికారులు ట్రయల్స్ చూస్తున్నారు. సెంట్రల్‌సిల్క్‌బోర్డు నుంచి ఐదు లూప్‌లు, కిందికి వచ్చేలా నిర్మాణాలు చేశారు. ఈ నెలలో ఏ, బీ, సీ ర్యాంప్‌లు అందుబాటులోకి రానుండగా వచ్చే ఏడాదికి డీ, ఈ ర్యాంప్‌లు పూర్తి చేస్తామని బీఎంఆర్‌సీఎల్ పీఆర్‌ఓ యశ్వంత్‌చౌహాన్ ప్రకటించారు. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ పూర్తి కావడం బెంగళూరు మౌలిక సదుపాయాల కల్పనలో ఓ మైలురాయి కానుంది. ఇది సిగ్నల్ రహిత కారిడార్‌గా ఉంటుంది. రాగిగుడ్డ నుంచి సెంట్రల్‌సిల్క్‌బోర్డ్ దాకా ఎటువంటి సిగ్నల్ లేకుండా ప్రయాణించవచ్చు. ఈ ఫ్లై ఓవర్ హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్, హోసూరు రోడ్డుకు వెళ్లేందుకు అనుకూలం కానుంది.





ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్

ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీతో పీఈఎస్ ఒప్పందం

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యాపరమైన సహకారం, అత్యాధునిక పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వీలుగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీతో నగరంలోని పీఈఎస్ యూనివర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. ఆదివారం నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఫ్లోరిడా విశ్వవిద్యాలయం చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కెన్నత్ జీ పర్దన్, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ గ్లోబల్ ఫోరెన్సిక్ డైరెక్టర్ కెవిన్ లోత్రిడ్జ్ పీఈఎస్ యూనివర్సిటీ ప్రో-చాన్స్‌లర్, పీఈఎస్ గ్రూప్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ డి. జవహర్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ పరిశోధనలు, ఆవిష్కరణలు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు పీఈఎస్ విద్యార్థుల కోసం ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటీతో ఒప్పందం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఫోరెన్సిక్ సైన్సెస్, సైబర్ ఫోరెన్సిక్ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీస్, డ్రోన్, ఓటీ, ఏఐఎంఎల్ వంటి విభాగాల్లో పీఈఎస్ యూనివర్సిటీ విద్యార్థులు దశాబ్దకాలంగా గణనీయమైన ప్రగతి సాధిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో ఈ ఒప్పందం కీలక భూమిక పోషించనుందన్నారు. రెండు యూనివర్సిటీలు తమ విద్య అవసరాలు, సాంకేతిక అన్వేషణలు, డిజిటల్ డేటా ప్రొటెక్షన్‌తోపాటు భారతీయ నాగరిక సురక్షా సంహిత వంటి జాతీయ కార్యక్రమాలకు మద్దతు ఇస్తుందన్నారు. ఫ్లోరిడా యూనివర్సిటీని 1965లో స్థాపించారు. ఇది ఫ్లోరిడాలోని మయామిలో ఒక ప్రముఖమైన పరిశోధనా విశ్వవిద్యాలయం. అత్యాధునిక పరిశోధనలకు కేంద్ర బిందువుగా ఉంది. ఈ సందర్భంగా డిస్కవరీ ల్యాబ్ డైరెక్టర్ రైడర్ ప్రొఫెసర్ ఎస్. అయ్యంగార్, పీఈఎస్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ సూర్యప్రసాద్, పీఈఎస్ గ్రూప్ ప్రొఫెసర్ అజోయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఒప్పందంలో రెండు యూనివర్సిటీల ప్రముఖులు

బెళగావిలో భ్రూణహత్యలు

- నకిలీ వైద్యుడి ఫాం హౌస్‌లో గుట్టురట్టు

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు, మండ్య ప్రాంతాల్లో కొన్ని నెలల క్రితం భ్రూణహత్యల ముఠా కలకలం రేపిన విషయం తెలిసిందే. అటువంటిదే బెళగావిలో ఓ నకిలీ వైద్యుడి నిర్వాకం బయటపడింది. బెళగావి జిల్లా కిత్తూరు పట్టణంలో నకిలీ వైద్యుడు పిల్లలను విక్రయించే కేసులో నిందితుడిగా ఉన్న అబ్దుల్ గఫార్ కొంతకాలంగా భ్రూణహత్యలకు పాల్పడినట్టు తెలుస్తోంది. కిత్తూరు తాలూకాలోని తిగళొల్లి గ్రామం ఫాంహౌస్‌లో పసికందు మృతదేహం వెలుగులోకి రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నకిలీ వైద్యుడు అబ్దుల్ గఫార్ లాడాఖాన్‌కు సహాయకుడిగా రోహిత్ కుప్పసగౌడర్ వ్యవహరిస్తున్నాడు. స్థానికులు జిల్లా అధికారికి సమాచారం ఇవ్వడంతో పోలీసులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఫోరెన్సిక్ బృందం తిగళొల్లి ఫాంహౌస్‌లో పసికందుల మృతదేహాలకోసం గాలించారు. జిల్లా వైద్యాధికారి మహేశ్‌కోణి, ఏసీ ప్రభావతి ఫకీరాపుర, డీఎస్పీ రవినాయక నేతృత్వంలో ఆదివారం ఫాంహౌస్‌లో సోదాలు నిర్వహించారు. తోటలో మూడు పసికందుల కళేబరాలను గుర్తించారు. ఆడశిశువు జన్మిస్తుందని నిర్ధారిస్తే నకిలీ వైద్యుడు అబార్షన్ చేయించేవాడని, అతడి సహాయకుడు భ్రూణాలను పాతిపెట్టేవాడని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నకిలీ వైద్యుడు అబ్దుల్ గఫార్ వెనుక ఎవరున్నారనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఫాంహౌస్‌తోపాటు ఎక్కడెక్కడ ఇలా వ్యవహరించారో గుర్తిస్తున్నారు. పెళ్లికి ముందే గర్భం దాల్చేవారిని, ఆడపిల్లలు వద్దనుకునేవారిని టార్గెట్ చేసి భ్రూణహత్యలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామని డీఎస్పీ తెలిపారు.



అబ్దుల్‌గఫార్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,583.03	1,580.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1619	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	577	260
సామర్థ్యం (టీఎంసీలు)	6.11	4.94

పచ్చని చెట్లతోనే కాలుష్యానికి చెక్



రాఘవేంద్ర కాలనీలో మొక్కలు నాటుతున్న దృశ్యం

బళ్లారి సిటీ, జూన్ 16: కాలుష్యాన్ని అరికట్టేందుకు పచ్చని చెట్లు అవసరమని 'మీకోసం మా సంస్థ' అధ్యక్షుడు వినయ్ తెలిపారు. నగరంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాఘవేంద్ర, రాయల్ కాలనీల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ వరుసగా తొమ్మిదో సంవత్సరం మీకోసం మాసంస్థ మొక్కలు నాటుతోందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం వానకాలంలో మొక్కలు నాటడంతోపాటు చెట్ల పెంపకదారులకు మొక్కలు అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి నాగరాజ్ మాట్లాడుతూ, ఇంటింటికి తమ సంస్థ మొక్కలు అందజేస్తారని ఇందుకు అందరి సహకారం ఉండాలన్నారు. ఈ సందర్భంగా సంజీవప్ప మాట్లాడుతూ తమ సంస్థ చేపట్టిన ఈ పథకం కింద మొక్కలు పెంచేందుకు ఆసక్తి ఉన్న వారికి ఇంటింటికి మొక్కలను అందజేస్తామన్నారు, నిరంతరం సామాజిక సేవ చేస్తున్న తమ సంస్థను ప్రజలు, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యప్రకాశ్, టీచర్లు పూర్ణిమ, సంస్థ కార్యవర్గసభ్యులు మొహబూబ్ బాషా, నాగరాజ్, అనిల్, వినయ్,శివరాజ్,శివప్రసాద్, మారుతి, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడే సమస్యలకు కారణం



యోగాభ్యాసం చేస్తున్న పతంజలి యోగా కమిటీ

బళ్లారి సిటీ, జూన్ 16: ఏపనినైనా దృఢ నిశ్చయంతో ప్రారంభిస్తే విజయవంతమవుతుందని పతంజలి యోగాసమితి రాష్ట్రకమిటీ సభ్యుడు డాక్టర్ హంద్రాల్ అన్నారు. హొస్పేట్‌లోని ఫ్రీడం పార్క్‌లో ఆదివారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా పతంజలి యోగాకమిటీ ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా హంద్రాల్ మాట్లాడుతూ, ఒత్తిడితో కూడిన జీవితమే అనేక సమస్యలకు మూల కారణమన్నారు. మధుమేహ నివారణలో ఆహార మార్పులు ప్రభావవంతంగా ఉంటాయన్నారు. కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రతి రోజు యోగా, ధ్యానం, ప్రాణాయామం, పాజిటివ్ థింకింగ్, పాజిటివ్ యాక్టివిటీ ఉండాలన్నారు. మన ఆలోచనలే మన వ్యాధికి మూలకారణమన్నారు. ఈసందర్భంగా పతంజలి యోగా సమితి యూత్ రాష్ట్ర సమితి ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, యోగా అభ్యాసకులు రాజేశ్ కర్వా, డాక్టర్ హల్లికేరి, అనంతజోషి, వివిధ కేంద్రాల నిర్వాహకులు ప్రకాశ్ కులకర్ణి, శ్రీరామ్, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమంలో ఓ సన్నివేశం

బళ్లారి సిటీ, జూన్ 16: కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం నాడోజ సుభద్రమ్మ మన్సూర్ బయలు రంగమందిరంలో నిర్వహించిన నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈసందర్భంగా సాంస్కృతికశాఖ సహాయ సంచాలకులు మాట్లాడుతూ.... నెలవారి సాంస్కృతిక కార్యక్రమాలు మనశ్శాంతి పొందాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చిన కళాభిమానులకు ప్రజానీకానికి ఎంతో వినోదాన్ని పంచుతున్నాయన్నారు. తదుపరి సిరుగుప్ప నరసింహమూర్తి హాస్యం ప్రేక్షకులను సంతోషపరిచింది. బళ్లారిలోని సుజా కళాట్రస్టు బృందం చేసిన బృందనృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు పాల్గొన్నారు.



తుంగభద్ర కళకళ

సిరుగుప్ప, జూన్ 16 : భారీ వర్షాల కారణంగా తుంగభద్ర నదికి వర్షపునీరు చేరడంతో నది జలకళ సంతరించుకుంది. నదిలో నీటి ప్రవాహం మొదలవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిరుగుప్ప తాలుకాలో గత యేడాది నదిలో నీరు లేక పూర్తిగా అడుగంటి పోయింది. ఈ యేడాది మొదట్లోనే భారీ వర్షాల కారణంగా తుంగభద్ర నది నిండుగా ప్రవహిస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు పంటలు పండించే అవకాశం వుందని ఆశాజనకంగా వున్నారు. టీబీ డ్యాంలోకి ఆదివారం ఇన్ ఫ్లో 1,619 క్యూసెక్కులు ఉండగా, నీటినిల్వ 6.11 టీఎంసీలకు పెరిగింది.

స్వామిమలై అటవీ ప్రాంతంలో / మైనింగ్‌పై స్థానికుల ఆందోళన

- తవ్వకాలకు అనుమతినిస్తూ సంతకం చేసిన కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి

బళ్లారి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సండూరు స్వామిమలై అటవీ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాలకు ఉక్కు శాఖ మంత్రి అనుమతి నివ్వడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఇక్కడ మైనింగ్‌కు అనుమతినిస్తే పర్యావరణానికి, నీటిపారుదలకు ప్రమాదం ఏర్పడుతుందని అటవీశాఖ 2020లోనే నివేదించింది. అయినా కేంద్రంలో కొత్తప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి మైనింగ్‌లో తవ్వకాలకు అనుమతి ఇవ్వడంతో పాటు కేంద్ర సంస్థ ద్వారా వీటి తవ్వకాలకు నిధులు కేటాయించాలని కోరారు.

స్వామిమలై ఫారెస్టులో మైనింగ్ కోసం 485.77 హెక్టార్ల విస్తీర్ణాన్ని కుద్రేముఖ్ (కేఐఓసీఎల్)కు కేటాయిస్తూ 2017 జనవరి 23న రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 470.40హెక్టార్లు మైనింగ్ ప్రాంతం కాగా, మిగిలిన 15.37 హెక్టార్లు వివిధ అవసరాలకు కేటాయించారు. దీని ప్రకారం ఫారెస్టు క్లియరెన్స్ (ఎఫ్‌సీ) కోరుతూ కంపెనీ 2018 మార్చి 16న ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌కు అభ్యర్థన పంపింది. అటవీశాఖ నోడల్ అధికారి దాన్ని అదే ఏడాది ఆగస్టు 30న బళ్లారి డీసీఎఫ్‌కి పంపించారు. ఆయన 2019 సెప్టెంబరులో ఈ ప్రాంతంలో పర్యటించి ఇక్కడ మైనింగ్ తవ్వకాలకు అనుమతి సాధ్యం కాదని నివేదించారు. డీసీఎఫ్ నివేదిక ఆధారంగా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(సీసీఎఫ్) కూడా 2019లో ఆటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే ఇప్పటికే ఇక్కడ ఉన్న గనుల వల్ల ఈప్రాంతానికి చాలా నష్టం జరిగిందని తిరిగి కొత్తగా ఇక్కడ మైనింగ్‌కు అనుమతి ఇవ్వరాదని, ఇస్తే ఇక్కడ వన్యప్రాణులు, నీటి భద్రత, భూస్వరూపంతో పాటు ప్రజా ఆరోగ్యం దెబ్బతింటుందని నివేదించారు. 2020 జనవరి 16న ఏపీసీసీఎఫ్, డీసీఎఫ్, సీసీఎఫ్, కేఐఓసీఎల్, ఇతర అధికారులు జాయింట్ కమిటీగా ఏర్పడి స్వామిమలై అటవీ ప్రాంతంలో పరిశీలించి ఇక్కడ తవ్వకాలు చేయడం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని నివేదించారు.

అటవీ శాఖ అభ్యంతరాలివీ..

ప్రతిపాదిత గని ప్రాంతం స్వామిమలై రిజర్వ్ ఫారెస్టులో ఉందని, మైనింగ్ వల్ల 993.30 చెట్లు కూల్చాల్సి వస్తుందని దట్టమైన అడవి నాశనమైతే నేల కోతకు గురై కొండ చెరియలు విరిగిపడుతాయని అటవీ శాఖ పేర్కొంది. ఇందువలన నీటి వనరుల గమనంలో మార్పు వస్తుందని, మైనింగ్‌కు అనుమతులు ఇస్తే అనేక అనర్థాలకు, అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని నివేదించింది. ఇలా అనేక విషయాలను ప్రస్తావిస్తూ ఇక్కడ మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇవ్వరాదని అటవీశాఖ నివేదించింది. అయితే ఇప్పుడు ఈ ప్రాంతంలో కుద్రేముఖ్ తరఫున దేవదారి కంపెనీకి మైనింగ్ తవ్వకాలకు కేంద్ర మంత్రి కుమార స్వామి తాజాగా అనుమతి ఇస్తూ సంతక చేయడం పట్ల ఇక్కడ ప్రజలు ఆందోళన వ్యక్తం చేయడమేగాకుండా అటవీశాఖ కూడా అవేదన వ్యక్తం చేస్తోంది.



మైనింగ్ ప్రాంతాన్ని తెలిపే శాటిలైట్ చిత్రం

అంగన్‌వాడీల్లోనే ఎల్‌కేజీ, యూకేజీ ప్రారంభించాలి



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బళ్లారి సిటీ, జూన్ 16: మెరుగైన సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగనవాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. పెడరేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు అర్కానీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ తప్పనిసరిగా ప్రారంభించాలని, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాలను విడనాటి సొంత భవనాల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించేందుకు అంగన్‌వాడీలను అనుమతించాలన్నారు. పిల్లలకు యూనిఫారం, బూట్లు, బ్యాగులు, పాఠ్యపుస్తకాలు అంగన్‌వాడీలకు సరఫరా చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు మరింత శిక్షణ ఇచ్చి పిల్లలను చదివించాలన్నారు. ఎస్టీఎంసీ పథకాన్ని రద్దు చేసి ప్రీస్కూల్ విద్యను పటిష్టం చేయాలన్నారు. కల్యాణ కర్ణాటకలోని ఏఐటీయూసీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు శుక్రవారం నుంచి అంగన్‌వాడీలను నిరవధికంగా బంద్ చేశారు. మాతృవందనం, భాగ్యలక్ష్మి, మొబైల్ పోషణ ట్రాక్ సమాచారం అందించకుండా నిలిపివేస్తున్నారు. నిరవధిక నిరసనకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా న్యాయ సలహాదారు ఇస్మాయిల్, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆదిమూర్తి,ప్రధాన కార్యదర్శి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ శిక్షణ శిబిరం

సిరుగుప్ప, జూన్ 16 : అంగన్‌వాడీలు పిల్లలకు శిక్షణ ఇవ్వడం కోసం శిక్షణ శిబిర కార్యక్రమంలో పాల్గొనడం అత్యవసరమని జిల్లా శిశు అభివృద్ధి యోజన డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. సిరుగుప్ప పట్టణం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎల్‌కేజీ, యుకేజీ విద్యాబోధన కోసం శిక్షణ శిబిర కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్‌వాడీలు పిల్లలకు బోధన కోసం ఈ శిక్షణ శిబిరం అత్యవసరమని ఆయన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు ఘన సన్మానం

బళ్లారిరూరల్, జూన్ 16 : బళ్లారి తాలుకా హగరి ఆర్ఎస్ సోమేశ్వరాలయంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కుటుంబ వేడుకలకు హాజరుకావడంతో హగరి పాల్తూరు గాదెలింగప్ప వారికి మర్యాదపూర్వకంగా శాలువా,పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వారితోపాటు టీడీపీ ప్రముఖులు శ్రీనివాస్, నారాయణ స్వామి, ఛాయాపురం చంద్ర శేఖర్, గ్రామప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



జయరామ్‌ను పూలమాలలతో సన్మానిస్తున్న దృశ్యం

లారీలు ఢీ - డ్రైవర్‌కు తీవ్రగాయాలు



ఢీకొన్న లారీలు

బళ్లారిరూరల్, జూన్ 16 : తాలుకాలోని పీడీహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్‌హెచ్ 63 రోడ్డుపై ఆదివారం తెల్లవారుజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు బలంగా ఢీకొనడంతో అందులో ఒక లారీ డ్రైవర్ కేశవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోగా స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీలో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీడీహళ్లి పోలీసులు తెలిపారు.

హోసూరు జోన్

ఉత్సాహంగా మారథాన్



మారథాన్ విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

హోసూరు, జూన్ 16: హోసూరులో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మినీ మారథాన్ నిర్వహించారు. పర్యావరణ దినోత్సవం పాటు పచ్చదనం ఆవశ్యకతను, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పలు అవగాహనాన కార్యక్రమాలను నిర్వహించారు. అరిమా సంఘాలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హ్యూమన్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌తో స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. బెంగళూరు, చెన్నై, జాతీయ రహదారికి సమీపంలో ఉన్న హోటల్ హిల్స్ నుంచి ప్రారంభమైన మారథాన్‌ను జిల్లా అటవీ శాఖ అధికారి కార్తికేయనీ జెండా ఊపి ప్రారంబించారు. 10 - 50 ఏళ్ల వ్యక్తులు మారథాన్‌లో పాల్గొన్నారు. ఐదు కిలోమీటర్ల నుంచి 10 కిలోమీటర్ల విభాగాల్లో జరిగిన మారథాన్‌లో 2650 మందికి పైగా పాల్గొన్నారు. వీరిలో 600మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నారు. మొదటి మూడు బహుమతులుగా సుమారు రూ.1.50 లక్షల నగదు బహుమతులను ఎమ్మెల్యే వై.ప్రకాశ్ పంపిణీ చేశారు. జూన్ 5వ తేదీ నుంచి ప్రారంభించి 2 వేలకు పైగా మొక్కలు నాటారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హోసూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సెందిల్ మాట్లాడుతూ ఏటా పర్యావరణ దినోత్సవాన్ని అర్థవంతంగా ఆచరిస్తున్నట్టు తెలిపారు.

నీటిపైపుల పరిశీలన

హోసూరు, జూన్ 16: కలుషిత నీటితో పెద్దసంఖ్యలో ప్రజలు అస్వస్థతకు గురై ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందుతున్న తరుణంలో హోసూరు కార్పొరేషన్‌తోపాటు నీటి ట్యాంకర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో తాగునీటిని ఉచితంగా సరఫరా చేశారు. 45వ వార్డు పరిధిలోని చిన్నయళసగిరి ప్రాంతంలో నీటి కాలుష్యంపై పరిశీలనలు చేపట్టారు. నీటి పైపుల లీకేజీలు, ఇతర సమస్యలను పరిశీలిస్తున్నారు. డ్యామేజ్ అయినవాటిని వెంటనే మార్పు చేస్తున్నారు. మరోవైపు ఏడు వైద్యబృందాలు నిరంతరం స్థానికంగా ఉంటూ స్థానికుల ఆరోగ్యంపై ఆరా తీస్తూ సలహా సూచనలు చేస్తున్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. ఒకవైపు అవసరమైన చోట్ల నీటిని ఉచితంగా పంపిణీ చేస్తుండగా, పైప్‌లైన్ మరమ్మత్తులకు కార్పొరేషన్ చొరవ చూపిందన్నారు.

జ్యోతిర్లింగ ప్రదర్శన

హోసూరు, జూన్ 16: హోసూరు బేగేపల్లి, ఎళిల్‌నగర్‌లో బ్రహ్మకుమారీస్ ఈశ్వర విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో 12 జ్యోతిర్లింగాల ప్రదర్శన ఏర్పాటైంది. స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన సమాజం కోసం ఆధ్యాత్మిక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జోనల్ ఇన్‌చార్జీ సరోజ అధ్యక్షత వహించారు. హోసూరు శాఖ అధ్యక్షుడు రామలింగం, వ్యాపారీ రాజేంద్రన్‌లు నాయకత్వం వహించారు. హోసూరు బేగేపల్లి పంచాయతీ సెంట్రల్ ఎక్సైజ్ జీఎస్టీ అసిస్టెంట్ కమీషనర్ రాజేశ్ ప్రత్యేక అతిథిలుగా హాజరయ్యారు. అరుణ్‌కుమార్, బెంగళూరు సంజయ్ నగర్ సెంటర్ ఇన్‌చార్జ్ సోని పాల్గొని 12 జ్యోతిర్లింగాల ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. బెంగళూరు యలహంక సెంటర్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. సోమనాథ, మల్లికార్జున, మహా కాళేశ్వర, ఓంకారేశ్వర, కేదర్‌నాథ్, భీమేశ్వర, కృష్ణేశ్వర, రామనాథస్వామి, నాగేశ్వర, వైద్యనాథేశ్వర, త్రయంబకేశ్వర, విశ్వనాథేశ్వర జోతిర్లింగాలను ప్రదర్శనల్లో ఏర్పాటు చేశారు.



రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన



రోడ్డు భద్రతపై అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ శశిధర్

బళ్లారిరూరల్, జూన్ 16: బళ్లారి తాలుకా సిడిగినమల గ్రామ సమీపంలోని జానకి ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై డ్రైవర్లకు ఎస్ఐ శశిధర్ అవగాహన కల్పించారు. డ్రైవర్లు వాహనం నడిపే సమయంలో సీటబెల్ట్ వాడాలని, మలుపుల వద్ద వెనుక నుంచి వస్తున్న వాహనాన్ని గమనించి బండిని టర్నింగ్ చేసుకోవాలని, రోడ్డు సిగ్నల్స్‌ను పాటిస్తూ వాహనాలు నడపాలని తెలిపారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా వుండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ జనరల్ సీనియర్ మేనేజర్ అన్వర్ బాషా, కానిస్టేబుల్ నరసింహ, పలు ఫ్యాక్టరీ అధికారులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

గంగా సమాజం ముందడుగు వేయాలి

కంప్లి, జూన్ 16: అన్ని సమాజాలతో పాటు గంగా మత సమాజం కూడా అన్నిరంగాల్లో ముందడుగు వేయాలంటూ ఎమ్మెల్యే జేఎన్‌గణేష్ తెలిపారు. గంగా జయంతి సందర్భంగా గంగా మతస్థులు గంగామాత ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పాల్గొన్నారు. జయంతోత్సవం సందర్భంగా మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటా పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. తమ వంతుగా ఈ సమాజ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఉదయం కంప్లి కోట నుంచి ఊరేగింపు ఎదురు మసీదు మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఇందులో మహిళలు కలశాలతో బాజా భజంత్రీలతో ఊరేగింపు చేపట్టారు. వారితో పాటు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎలగారు నాగరాజు, ప్రకాష్, సిద్దప్ప, మనోహర్, వెంకటేష్, ఉమేష్, దినేష్, రఘు, విరుపాక్షి, హనుమంతప్ప, మల్లికార్జున, సురేష్, వెంకటేష్, సమాజం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ మరమ్మతులకు వినతి



ఎంపీ తుకారామ్‌క వినతి పత్రం అందిస్తున్న హేమయ్యస్వామి

కంప్లి, జూన్ 16 : గంగావతి నుంచి కంప్లి మీదుగా దరోజీ వరకు త్వరగా రైలుమార్గం మరమ్మతులు చేయాలని బళ్లారి ఎంపీ తుకారామ్‌ను రైల్వే సమితి అధ్యక్షుడు హేమయ్యస్వామి కోరారు. ఆదివారం ఎంపీ తుకారామ్‌ను సండూరులోని కార్యాలయంలో కలిసి, మనవిపత్రం అందించారు. ఇప్పటికే రూ.999.49 కోట్లు మంజూరైనట్లు కూడా తెలిపారు. త్వరలోనే ఆ పనులను ప్రారంభించాలని కోరారు. దీంతో పాటు కంప్లికోట వద్ద వున్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఎప్పుడు కూలుతుందో తెలియదని, కావున ఆ వంతెన నిర్మాణం కూడా చేపట్టాలన్నారు. ఆ వంతెన నిర్మాణానికి రూ. 69 కోట్లు మంజూరయ్యాయని, వాటితో కొత్త వంతెన నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దీనిపై పార్లమెంట్‌లో చర్చించి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. వారితో పాటు నారాయణ, ఆదిమని కాళింగవర్దన వున్నారు.

రోడ్డు మరమ్మతులకు ముందుకొచ్చిన కేపీసీఎల్

కంప్లి, జూన్ 16 : కుడితిని వద్దగల కేపీసీఎల్ తిమ్మలాపురం నార్త్ గేటు వద్ద రోడ్డు గుంతలమయమై రాకపోకలకు అంతరాయం కలగడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శనివారం కర్ణాటక రక్షణ వేదిక పదాధికారుల నిరసనలను దృష్టిలో వుంచుకుని, ఎట్టకేలకు కేపీసీఎల్ అధికారులు రోడ్డు మరమ్మతులు చేయడానికి ముందుకొచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గతంలోనే ఆ రోడ్డు మరమ్మతు పనులకు అంచనాలు వేశామని, త్వరలోనే రోడ్డు మరమ్మత్తు పనులు చేపడతామన్నారు. పీడబ్ల్యూడీ అధికారులతో చర్చించి పనులు త్వరలోనే జరుపుతామని తెలిపారు. తాత్కాలికంగా సమస్యలు తలెత్తకుండా పనులు చేపడుతున్నామని తెలిపారు.

ఇద్దరు మహిళా దొంగల అరెస్టు

బళ్లారిరూరల్, జూన్ 16 : సండూరు పోలీస్ స్టేషన్ పరిధితో పాటు పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న చెన్నవ్వ (21), హనుమవ్వ (21) అను ఇద్దరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి విజయనగర జిల్లా హోస్పేట కరిగనూరు క్యాంపుకు చెందిన వారిగా గుర్తించారు. వారి వద్ద నుంచి 238 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.11.19 లక్షలు వుంటుందని తెలిపారు. వీరిద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సండూరు పోలీసులు తెలిపారు. ఎస్పీ రంజిత్ కుమార్ భండారి, అడిషనల్ ఎస్పీ రవికుమార్‌లు సండూరు పోలీసులను అభినందించారు.

మొక్కలు నాటి పరిసరాలను సంరక్షించాలి

కంప్లి, జూన్ 16 : ప్రతి ఒక్కరు తమ చుట్టూ పొలాల్లోను, ఇంటి ప్రాంగణంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలంటూ అహింద సంఘం అధ్యక్షులు దమ్మూరు మంజునాథ తెలిపారు. తాలుకా పరిధిలోని కొండనాయకనహళ్లి, యల్లలింగ దేవస్థాన ఆవరణలో అనంత శనయ ఆలయం అహింద యువ ఘటక ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దమ్మూరు మంజునాథ మాట్లాడుతూ మనుషులు సంపాదనపై ఎలా దృష్టి సారిస్తామో అలాగే మొక్కల పెంపకంపై దృష్టి సారిస్తే పుష్కలంగా గాలి లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ సీజన్లో మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ఉమేష్, పాత్రికేయుల సంఘం అధ్యక్షులు రాజు, సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణానికి నైతిక విలువలే పునాది



అధిక మార్కులు పొందిన వారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

రాయచూరు, జూన్ 16 : నేటి సమాజంలో వ్యక్తుల్లో నైతిక విలువలు పెంపొందించడం ద్వారానే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు గిరిధర్ పూజారి అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువల గురించి బోధించడం నేటి సమాజానికి అనివార్యమన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ఉన్నతమైన శిఖరాలను చేరుకుంటున్నా నైతిక విలువల పట్ల అవగాహన లేకపోవడం ప్రధాన లోటుగా మిగిలిందన్నారు. నగరంలోని కన్నడ భవన్‌లో ఆదివారం కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా తాలూకా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కన్నడ బాషకు సంబంధించి ఇటీవల వెలువడిన ఎస్ఎస్ఎల్‌సీ(టెన్త్) ఫలితాల్లో కన్నడ సబ్జెక్ట్‌లో 125 మార్కులకు 125 మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులను అందజేశారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడిన గిరిధర్ పూజారి, విద్యార్థుల్లో నైతిక విలువల బోధనపై ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రులు సహితం దృష్టి సారించాల్సి ఉందన్నారు. కేవలం ర్యాంకుల పై ఆధారపడినంత మాత్రాన ఉన్నత వ్యక్తిత్వం సాధ్యపడిందని ఇందుకు మన సమాజంలోని వెలుగులు, జరుగుతున్న పరిణామాలు, చరిత్ర సంస్కృతి సంప్రదాయాలు వాటన్నిటిపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం అవసరమన్నారు.


తాగునీటి చెరువులు నింపేందుకు చర్యలు

రాయచూరు, జూన్ 16 : వేసవి కాలం ముగుస్తున్న సందర్భంగా తలెత్తిన తాగునీటి ఎద్దడి నివారించేందుకు అన్ని చెరువులను నీటితో నింపాలని మస్కి ఎమ్మెల్యే తుర్విహాళ్ బసనగౌడ అన్నారు. ఇప్పటికే అధికారులు తుంగభద్ర ఎడమకాలువ ద్వారా తాగునీటి అవసరాల కోసం 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన నేపథ్యంలో అధికారులు వాటిని సద్వినియోగం చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. తాలూకాలోని మైల్ నెంబర్ 16 వద్ద కాలువకు నీటి విడుదలను ఆదివారం పరిశీలించిన ఎమ్మెల్యే తాలూకాలో తాగునీటి అవసరాలు తీర్చే చెరులన్నింటినీ త్వరితగతిన నింపాలని అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలను ప్రజల నుంచి తీసుకోవాలని సూచించారు. కాగా తుంగభద్ర ప్రధాన ఎడమకాలువ అనుబంధ కాలువకను గుణంగా పంప్‌సెట్‌లను ఏర్పాటు చేసి అధికారులు తాగునీటి చెరువులు నింపేందుకు చర్యలు చేపట్టారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చిలకమర్తి లక్ష్మీ నరసింహం (వర్ధంతి)



చిలకమర్తి లక్ష్మీ నరసింహం 1867 సెప్టెంబరు 26న పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలంలోని ఖండవల్లి గ్రామంలో జన్మించారు. కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కర్త, విద్యావేత్తగా బహుముఖ ప్రజ్ఞాశాలి. 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దపు ఆరంభంలో తెలుగు సాహిత్య అభివృద్ధికి, తెలుగునాట ఆధునిక భావాల వికాసానికి పట్టుగొమ్మలలో ఒకరిగా నిలిచారు. 22వ యేట ఆయన రచించిన 'గయోపాఖ్యానం' అనే నాటకం ప్రతులు లక్షకుపైగా అమ్ముడుపోవడం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక రికార్డుగా నిలిచింది. 30వ యేట రేచీకటికి గురైనా అధిగమించి రచనలు చేశారు. ఆంధ్రదేశంలో నిమ్న వర్గాల వారికి ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత చిలకమర్తికే దక్కుతుంది. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. కొద్దికాలం అష్టావధానం చేశారు. 1946 జూన్ 17న కన్నుమూశారు.

తిరుమల రామచంద్ర (జయంతి)



తిరుమల రామచంద్ర 1913 జూన్ 17న అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకాలో జన్మించారు. సంపాదకుడు, రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, భాషావేత్త. మాతృభాష తెలుగుతో పాటు కన్నడ, తమిళ, సంస్కృతం తదితర భాషల్లో ప్రావీణ్యం కల్గినవారు. విజయనగర సామ్రాజ్యంలో కానవచ్చే తాతాచార్యుల వంశీయులు. వేటూరి ప్రభాకర శాస్త్రికి ఏకలవ్య శిష్యుడిగా చెప్పుకొనే ఆయన విద్వాన్ విశ్వం వంటి వారితో పని చేశారు. ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రిక, ఆంధ్రభూమి తదితర పత్రికలలో వివిధ హోదాల్లో పనిచేశారు. సాహిత్య అకాడమీ పురస్కారం, పత్రికార శిరోమణి, కళాసరస్వతి ఇతర గౌరవాలు అందుకున్నారు. 1997 అక్టోబరు 12న కన్నుమూశారు.

లియాండర్ పేస్ (పుట్టినరోజు)



పద్మభూషణ్ పురస్కార గ్రహీత లియాండర్ అండి య్రన్ పేస్ 1973 జూన్ 17న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్కత్తాలో జన్మించారు. టెన్నిస్ క్రీడాకారుడైన ఆయన డేవిస్ కప్ టీమ్‌కు కేప్టెన్‌గా వ్యవహరించారు. డబుల్స్‌లో 8, మిక్స్‌డ్ డబుల్స్‌లో 10 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను సాధించారు. 1999 వింబుల్డన్‌లో సత్తా చాటుకున్నారు. 1992 నుంచి 2016 వరకు జరిగిన ఒలింపిక్స్ పోటీల్లో వరుసగా ప్రాతినిధ్యం వహించారు. కాంస్య పతకం సహా పలు మెడల్స్ అందుకుని దేశ గౌరవాన్ని ఇనుమడింపచేశారు. రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున అవార్డు, పద్మశ్రీ వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు.

పాతమైసూరులో పుంజుకున్న జేడీఎస్

- హస్తగతమైన ఒక్కలిగ కోటలో సత్తా
- కలిసొచ్చిన బీజేపీ పొత్తు



కుమారస్వామి





డీకే శివకుమార్

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా జరిగిన ఎన్నికల్లో పాతమైసూరు ప్రాంతం హస్తగతమైంది. వాస్తవానికి జేడీఎస్ పార్టీ దశాబ్దాల మనుగడకు పాత మైసూరు ప్రాంతమే శక్తినిచ్చింది. మైసూరు, మండ్య, చామరాజనగర, హాసన్, రామనగర, బెంగళూరు గ్రామీణ జిల్లాల దాకా పాత మైసూరు ప్రాంతంగా పిలుస్తారు. ఈ ప్రాంతంలోని ఒక్కలిగ సామాజికవర్గం ప్రజలు అత్యధికంగా ఉన్నారు. అందుకే జేడీఎస్‌కు శక్తికేంద్రంగా కొనసాగింది. కానీ జేడీఎస్ నుంచి ఎదిగిన ఎంతోమంది ఇతరపార్టీలలోకి వెళ్లిపోవడంతో వరుస దెబ్బలు తగిలాయి. 20ఏళ్లకుపైగా ఇదే విధానం కొన సాగింది. ఎంతోమంది రాజకీయాలను జేడీఎస్‌లో ప్రారం భించి ఆ తర్వాత వారి వ్యక్తిగత ఎదుగదలకోసం పార్టీని వీడారు. మైసూరు ప్రాంతంలో ఎదిగిన ప్రతినాయకుడు జేడీఎస్ మూలాలు కలిగినవారే. రాష్ట్రంలో రెండోసారి ముఖ్యమంత్రి అయిన సిద్దరామయ్య కూడా ఒకప్పుడు జేడీఎస్‌లో కొన సాగినవారే. ఇలా ఈ ప్రాంతంలో ఎంపీలు, ఎమ్మెల్యేలుగా వ్యవహరించి జేడీఎస్‌కు దూరమవ్వడంతో వారి ప్రభావం పార్టీపైనా పడింది. ఇతర పార్టీలలోకి వెళ్లినవారు ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలుపొందారంటే జేడీఎస్ కార్యకర్తలు సైతం వారివైపు మళ్లించుకున్నారనేందుకు ఉదాహరణంగా ఉన్నాయి. 2023 శాసనసభ ఎన్నికల్లో త్రిముఖపోటీలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేదనేలా విజయం సాధించింది. ఇలా కాంగ్రెస్‌కు 136 స్థానాలు వచ్చాయంటే పాతమైసూరు ప్రాంతంలో అత్యధిక స్థానాలు రావడమే కారణం. మరోవైపు బీజేపీ కూడా ఇటీవల దశాబ్దన్నర కాలంలో మైసూరు జిల్లాలో నాయకత్వం పెంచుకుంటూ వస్తోంది. అంతకు ముందు బీజేపీకి గ్రామస్థాయిలో కూడా కేడర్ లేదు. హాసన్, మండ్య, మైసూరు జిల్లాల్లో ఎమ్మెల్యేలతోపాటు ఎంపీలు సైతం గెలిచే స్థాయికి ఎదిగారు. ఓట్ల విభజనతోనే ఎదురుదెబ్బ తగులుతోందని భావించిన జేడీఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కుదుర్చుకుంది. ఎమ్మెల్యేలుగా కాంగ్రెస్‌కు చెందినవారు అత్యధికులు ఉన్నా లోక్‌సభ ఎన్నికల్లో మైత్రి కూటమి విజయఢంకా మోగించింది. మైసూరు, మండ్య, బెంగళూరు గ్రామీణ, కోలారు, చిక్క బళ్ళాపుర, తుమకూరు నియోజకవర్గాలు బీజేపీ-జేడీఎస్ కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందారు. కాగా ప్రజ్వల్ పెన్‌డ్రైవ్ వివాదం కారణంగా హాసన్‌ను కోల్పోవాల్సి వచ్చింది. కానీ చిత్రదుర్గ, శివమొగ్గతోపాటు పలు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి జేడీఎస్ మద్దతు అపూర్వ ఆదరణ అనిపించింది. ఒక్కలిగ సామాజికవర్గంలో నాయకత్వం కోసం మాజీ ప్రధాని దేవేగౌడ, డీసీఎం డీకే శివకుమార్ కుటుంబాల మధ్య సాగుతోంది. ఏడాదికిందటి శాసనసభ ఎన్నికలు కాంగ్రెస్‌కు అనుకూలం కావడంతో ఇక తిరుగులేదని అత్యధిక ఒక్కలిగలంతా నావైపే ఉన్నారని డీకే శివకుమార్ భావించారు. లోక్‌సభ ఎన్నికల వేళ కూటమి నాయకులు వ్యూహాత్మకమైన నిర్ణయాలతో తిప్పికొట్టారు. మండ్య నుంచి నేరుగా కుమారస్వామి రంగంలోకి దిగారు. కాంగ్రెస్ పార్టీ శ్రీమంతుడైన వెంకటరమణగౌడ అలియాస్ స్టార్ చంద్రును బరిలోకి నిలిపింది. ఇక బెంగళూరు గ్రామీణలో డీకే శివకుమార్ తమ్ముడు డీకే సురేశ్ హ్యాట్రిక్ గెలుపు కోసం బరిలోకి దిగారు. ఇదే స్థానం నుంచి దేవేగౌడ అల్లుడు, జయదేవ ఆసుపత్రుల మాజీ డైరెక్టర్ డాక్టర్ సీఎన్ మంజునాథ్ బీజేపీ నుంచి పోటీ చేయించారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా డీకే సురేశ్ గెలుస్తారనే ప్రచారం సాగింది. అయితే 2.69 లక్షల ఓట్ల మెజారిటీతో డాక్టర్ మంజునాథ్ గెలుపొందారు. కుమారస్వామి 2.82 లక్షల మెజారిటీతోనూ, మైసూరులో యువరాజు యదువీర్ 1.39 లక్షల మెజారిటీ, చిక్కబళ్ళాపురలో డాక్టర్ సుధాకర్ 1.36 లక్షలు, తుమకూరులో కేంద్రమంత్రి సోమణ్ణ 1.75 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపు నమోదు చేశారు. ఉనికి కోల్పోతున్నామని భావించిన కోలారు నియోజకవర్గంలో సైతం జేడీఎస్ అభ్యర్థి మల్లేశ్‌బాబు తిరుగులేని మెజారిటీ సాధించారు. కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారెంటీలు, అహింద ప్రభావం లోక్‌సభ ఫలితాలపై పడలేదు. భారత్‌జోడో యాత్ర, మేకె దాటు పాదయాత్ర ద్వారా మైసూరు ప్రాంతంలో ఒక్కలిగ నాయకత్వాన్ని పెంచుకున్న డీకే శివకుమార్‌కు లోక్‌సభ ఎన్నికల్లో తిప్పికొట్టినట్టయ్యింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అత్యధికమంది ఉన్నా ప్రయోజనం లేదనిపించింది. కొన్నేళ్లతర్వాత జేడీఎస్ కంచుకోటలో స్థానాన్ని పదిలం చేసుకుంది.

65 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాన శిబిరంలో నిర్వాహకులు

దొమ్మసంద్ర, జూన్ 16: ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలోని ధర్మసాగర హైస్కూల్‌లో ఆసరె సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరం ద్వారా 65 యూనిట్ల రక్తం సేకరణ కావడంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. చందాపురలోని నారాయణ హృదయాలయ రక్తనిధి కేంద్రానికి అప్పగించారు. శిబిరంలో 18సార్లకుపైగా ఒకరు, 86 సార్లకుపైగా మరొకరు రక్తదానం చేసినవారు కూడా ఉన్నారు. రక్తదానంతో మరొకరి ప్రాణాలు నిలపడం సాధ్యం కావడంతోనే తమవంతుగా ఇలా చేస్తున్నట్టు వారు తెలిపారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఆసరె సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 8 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు చేపడుతున్నట్టు నిర్వాహకులు చెలువరాజ తెలిపారు.

గవర్నర్ సాక్షిగా వీసీ కంటతడి

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మంగళూరు విశ్వ విద్యాలయం స్నాతకోత్సవం వేళ గవర్నర్ సాక్షిగా వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ పీఎల్ ధర్మ వేదికపైనే కంతటడి పెట్టారు. శనివారం 12గంటలకు విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవం జరగాల్సి ఉండేది. యూనివర్సిటీ ముఖ్యులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కార్యక్రమ షెడ్యూల్‌ను నిమిషాలవారీగా పకడ్బందీగా రూపొందించారు. గవర్నర్ గన్‌మెన్ ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్‌ను వేదిక నుంచి తోసివేయడంతో వివాదం చెలరేగింది. స్నాతకోత్సవం ఒక్కసారిగా గందరగోళంకు దారి తీసింది. పాత్రికేయులు, కెమెరామెన్‌లు, వీడియోగ్రాఫర్‌లు గన్‌మెన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రసా భాసగా మారింది. ఒక్కసారిగా వైస్‌చాన్స్‌లర్ వేదికపైనే కన్నీరు పెట్టారు. కాంగ్రెస్, బీజేపీ ముఖ్యులు గవర్నర్ థావర్ చంద్‌గెహ్లాట్ గన్‌మెన్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

కన్నడ పరిశోధనలపై తగ్గిన ఆసక్తి



చిదానంద పురస్కారాల ప్రదానంలో ప్రముఖులు

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాష సాహిత్య సాంస్కృతిక పరంగా శతాబ్దాల పరిశోధన ఉన్నా ఇటీవలకాలంలో ఆసక్తి తగ్గుముఖం పట్టిందని ప్రముఖ సాహితీవేత్త హంపానాగరాజయ్య విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మైసూరు విద్వాంసులు డాక్టర్ ఎస్ఎస్ తారానాథ్‌కు చిదానంద పురస్కారాన్ని ప్రదానం చేశారు. కన్నడసంఘం సంచాలకులకు డాక్టర్ రుద్రేశ్ అదరంగి సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో హంపా నాగరాజయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రాచీనకాలం నుంచి నేటి ఆధునికయుగం దాకా కన్నడభాషలో ఎంతోమంది పరిశోధనలు చేశారన్నారు. సాహిత్యం, చరిత్ర, శాసనాలు, భాషశాస్త్రం రంగాలలో లోతైన అధ్యయనం జరిగిందన్నారు. అందుకే ప్రతి అంశంలోనూ కన్నడభాష ఔన్నత్యం వెలుగులోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం అరచేతిలో సమాచారం లభించే కాలం వచ్చిందని సద్వినియోగం చేసుకుని మరిన్ని పరిశోధనలు వస్తాయని ఆశిస్తామన్నారు. డాక్టర్ ఎన్ చిదానందమూర్తి అత్యంత సూక్ష్మమైన అంశాలపై పరిశోధనలు చేశారన్నారు. ఆయన జీవితకాలం భాష, చరిత్రపై పరిశోధనలు చేశారన్నారు. డాక్టర్ శశికళ మాట్లాడుతూ పరిశోధనా పరంపర ఆధునిక కాలంలోనూ కొనసాగాలని అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీటీ శ్రీనివాసనాయక అధ్యక్షత వహించగా పురస్కార కమిటీ కార్యదర్శి డాక్టర్ ఎస్ఎల్ శ్రీనివాసమూర్తి, సమితి అధ్యక్షుడు మంజునాథ్ పాల్గొన్నారు. కన్నడవిభాగం ముఖ్యులు శివప్రసాద్, బీసీ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌లో క్రికెట్

- ముగ్గురు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా మధుగిరి ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో క్రికెట్ ఆడుతూ గడిపిన వీడియోలు వైరల్ కావడంతో ఆసుపత్రి సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలకు జిల్లా వైద్యాధికారి మంజునాథ్ ఆదేశించారు. ఇటీవల డయాలసిస్ సెంటర్‌లో ముగ్గురు థెరపిస్ట్‌లు క్రికెట్ ఆడుతూ గడిపిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ మేరకు థెరపిస్ట్ లతేశ్‌కుమార్, హర్షవర్ధన్, దివ్యలను తప్పించి కొత్త సిబ్బందికి నియామకాలు చేశారు. క్రికెట్ ఆడడమే తప్పు కాగా సదరు వీడియోలను సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. క్రికెట్ ఆడేందుకు లాగ్ బుక్‌ను బ్యాట్‌గా ఉపయోగించడం, ప్లాస్టిక్‌బంతితో చిన్నపిల్లలు ఆడినట్టుగా డయాలసిస్ కేంద్రంలో ఆటలాడారు. యూనిఫాంలోనూ ఉంటూ బాధ్యత లేకుండా వ్యవహరించడం ఇద్దరు సిబ్బంది ఆటలాడుతుండగా చీర్‌గర్ల్స్ తరహాలో ఒక యువతి క్లాప్స్ కొట్టిన వీడియోలు ఉన్నాయి. శుక్రవారం వీడియోలు వైరల్ కాగా జిల్లా వైద్యాధికారి స్పందించారు.

ఇంకుడుగుంతలకు ప్రాధాన్యత పెరగాలి

చేళూరు, జూన్ 16: వర్షపునీటి సేకరణకు సంబంధించి ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకునే ప్రాధాన్యత పెరగాలని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామాలలో ఇందుకు సంబంధించిన అవగాహనా కార్యక్రమాలు పెరగాలన్నారు. ఇటీవలకాలంలో వర్షాభావం పెరిగిన తరుణంలో ఇంకుడుగుంతలను తవ్వుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా భూగర్భజలాల నీటిమట్టం పెరుగుతుందని, వర్షపునీరు వృథా కాదని అంటున్నారు.

బక్రీద్‌కు జోరుగా గొర్రెల విక్రయాలు



చింతామణి సంతలో గొర్రెల విక్రయాలు

చింతామణి, జూన్ 16: బక్రీడ్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్ సంతలో ఆదివారం గొర్రెలు, మేకల వ్యాపారం జోరుగా సాగింది. అవిభాజ్య కోలారు జిల్లానుంచి సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ప్రాంతాలనుంచి వేలాదిగా గొర్రెలు, మేకలను టెంపోలు, ఇతర వాహనాలలో మార్కెట్‌కు తెచ్చారు. రూ.10వేల నుంచి రూ.60వేల వరకు ధర పలికాయి. మెంటమ్‌జాతి కశ్మీరు మేక సుమారు 15కేజీల బరువు ఉండగా రూ.20వేల ధర పలికింది.

బంగారపేటలో...



మెంటమ్ జాతి కశ్మీరు మేక

బంగారపేట: బంగారపేట పట్టణంలోని తాలూకా ఏపీఎంసీ మార్కెట్ ఆవరణలో గొర్రెలు, మేకల విక్రయాలు జోరుగా సాగాయి. పొట్టేలు రూ.70వేల ధర పలికింది. ఆదివారం ఉదయమే పెద్దసంఖ్యలో చుట్టుపక్కల ప్రాంతాలనుంచి వాహనాలలో గొర్రెలు, మేకలు చేరుకున్నాయి. బూదికోటె హోబళి గుల్లహళ్ళికి చెందిన సిద్దప్ప తమ పొట్టేలును రూ.70వేలకు విక్రయించారు. బెంగళూరు నగర, చిక్కబళ్ళాపుర, బెంగళూరు గ్రామీణ, రామనగర తదితర జిల్లాల నుంచి మార్కెట్‌కు వచ్చారు. కనీసం రూ.5వేలనుంచి ప్రారంభధరలో ఇక్కడ గొర్రెలు విక్రయించారు.



బంగారపేట సంతలో గొర్రెల విక్రయాలు

నగరసభ కమిషనర్‌తో రవాణాశాఖ చర్చలు



నగరసభ కమిషనర్‌కు రవాణాశాఖ అధికారుల వినతి

శిడ్లఘట్ట, జూన్ 16: రవాణాసంస్థకు చెందిన స్థలంలో ఒక వ్యక్తి బంకు అంగడి పెట్టేందుకు ప్రయత్నించారనే ఫిర్యాదుపై రవాణా అధికారులు స్పందించారు. వెంటనే నగరసభ కమిషనర్‌తో చర్చలు జరిపారు. సదరు స్థలం తమకు చెందినదేనని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తి బంకు పెట్టేందుకు ప్రయత్నించారని ఇందుకు అవకాశం కల్పించరాదని కోరారు. 1992 నుంచి తమ స్వాధీనంలోనే ఉందని వివరించారు. ప్రయాణీకులకు సైకిల్‌స్టాండ్‌కు దారి కోసం స్థలాన్ని కేటాయించామన్నారు. ఇందుకు సంబంధించి ఏటా పన్నులు చెల్లించిన డాక్యుమెంట్లు సమర్పించారు. దీనిపై కమిషనర్ మంజునాథ్ మాట్లాడుతూ సోమవారం సదరు స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

మంటలను ఆర్పే డ్రోన్ రూపకల్పన



డ్రోన్‌తో విద్యార్థులు, తదితరుల బృందం

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవలికాలంలో అగ్ని ప్రమాదాలు పెను నష్టాలకు కారణమవుతున్నాయి. బహుళ అంతస్థుల భవనాలలో అగ్నిప్రమాదం జరిగితే నియంత్రణ సమస్యగా మారింది. గోపాలన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మంటలు నివారించేలాంటి ప్రత్యేకమైన డ్రోన్ రూపొందించారు. గ్రోయింగ్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ ఓరియంటెడ్ కాంగ్రిగేషన్ స్టేజ్ 4.0 పేరిట రెండు రోజుల నమూనాల ప్రదర్శన జరిగింది. అగ్ని ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడడంతోపాటు ఆస్తినష్టం అరికట్టవచ్చునని డీఆర్‌డీఓ మాజీ సైంటిస్ట్, ప్రొఫెసర్ హరజీందర్‌సింగ్ భాటియా అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ రంగంలో పరిశోధనలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కళాశాల ముఖ్యులు డాక్టర్ సి ప్రభాకర్, సీఈఓ భాస్కర్‌రెడ్డి, సునీతా ప్రభాకర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా పూల కరగ



అమ్మవారికి విశేష అలంకరణ

బాగేపల్లి, జూన్ 16: తాలూకాలోని గూళూరు గ్రామంలో గ్రామదేవత పాతకోటమ్మ ధర్మ రాయ స్వామి పూలకరగ ఉత్సవం ఘనంగా జరిగింది. పూలకరగను ధర్మేశ్ ధరించారు. గూళూరులో కరగ ఊరేగింపు సందడిగా సాగగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పాతకోటమ్మ దేవాలయం నుంచి బయల్దేరిన కరగధారి ధర్మేశ్ పురవీధులలో లయబద్ధంగా నాట్యం చేస్తూ ఊరేగారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి, దేవాలయ సమితి అధ్యక్షుడు రమేశ్‌బాబు పాల్గొని కరగ మహోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కరగ ఉత్సవం నేపథ్యంలో రసమంజరి కార్యక్రమం ఆకట్టుకుంది. భక్తులకు భోజన వ్యవస్థ కల్పించారు.

వచనాలతో జనంలో చైతన్యం



వచన గానయాన ముగింపు సమావేశంలో ప్రముఖులు

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణం లక్ష్యంగా 12వ శతాబ్దంలో వచనాల ద్వారా బసవణ్ణ చైతన్యం కలిగించారని, వాటిని ఆలపించడం ద్వారా శక్తితోపాటు ముక్తి సాధ్యమని వచనజ్యోతి బళగ అధ్యక్షుడు పినాకపాణి అభిప్రాయపడ్డారు. విజయనగరలో డాక్టర్ చిదానందమూర్తి సభావేదికపై వచన గాన యాన ముగింపు సమావేశంలో ముఖ్యులుగా పాల్గొన్నారు. బసవణ్ణతోపాటు వచనకారులు మనకు వచనాల రూపంలో అమూల్యమైన సంపద ఇచ్చారన్నారు. వాటిని పాడడంతోపాటు ఆచరించడం ద్వారా సరికొత్త జీవితాన్ని పొందవచ్చునన్నారు. విద్యార్థులకు వచనాలు నేర్పడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. వచనజ్యోతి బళగ గౌరవాధ్యక్షుడు మహేశ్‌బెల్లద్, శశివిశ్వనాథ్, నంజప్పలు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. గాయకులు టీఎం జానకి, ఉమేశ్ ఆరాధ్య, నిశా, చంద్రశేఖర్, కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్ మోటార్ల పంపిణీ

పావగడ, జూన్ 16 : గంగకల్యాణి పథకం కింద 2021-22 సంవత్సరానికిగాను మంజూరైన పంపుసెట్లు, పైపులను 24మంది రైతులకు ఆదివారం ఎమ్మెల్యే వెంకటేశులు చేతలమీదుగా పంపిణీ చేశారు. దాదాపు రూ.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు సరిపడా వ్యవసాయ పరికరాలను అందజేశారు. ప్రతి రైతు ఈ పరికరాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికం గా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామాంజినప్ప, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ 48వ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, కార్యకర్తల మధ్య ఎఎస్ఎస్‌కె రంగ మందిరంలో ఘనంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం 1గంటకు 48కేజీల కేక్‌ను కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టి 2023లో మీరందరూ ఓట్లేసి గెలిపించిన ఆశీస్సులు, దీవెనలు నాకు జీవితాంతం ఉండాలని అభిమానులకు కృతజ్ఞత లు తెలిపారు. తాను ఖరీదైన కారులో తిరిగినా తన మనసెప్పుడు పేదవాడిగానే ఉంటుందని, పేదల పట్ల విద్యార్థుల విద్యపట్ల ఎప్పుడూ ముందంజ లో ఉంటానన్నారు. ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యా సామాగ్రి పంపిణీ చేశారు.

రేపు పీఎం కిసాన్ సొమ్ము విడుదల

అనంతపురం అర్బన్, జూన్ 16: పీఎం కిసాన్ అమలులో భాగంగా ఈ ఏడాదికి మొదటి విడత సొమ్మును ఈనెల 18న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విడుదల చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. 18న సాయంత్రం 4 గంటలకు పీఎం కిసాన్ సొమ్మును ప్రధాన మంత్రి డీబీటీ ద్వారా జమ చేస్తారన్నారు. అర్హులైన రైతులకు రూ.2 వేలు చొప్పున జమ అవుతుందన్నారు. కార్యక్రమాన్ని రైతు బజార్ కేంద్రంలో రైతులకు లైవ్ టెలికాస్ట్ ద్వారా ప్రదర్శించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు



శిబిరంలో మహిళలకు సూచనలు ఇస్తున్న సంస్థ ప్రతినిధులు

మహదేవపుర, జూన్ 16: స్థానిక వర్తూరులో బెంగళూరు వికాస తరంగిణి, వర్తూరు తెలుగు సంఘం, వైట్‌ఫీల్డ్ రైజింగ్ సంస్థలు సంయుక్తంగా మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షా శిబిరం నిర్వహించారు. 'సేవ్ ఉమెన్ సేవ్ వరల్డ్' అనే చిన్న జీయర్ స్వామిజీ ఆశయం మేరకు వారి అనుబంధ సంస్థ మహిల ఆరోగ్యవికాస సభ్యులు మాధవి బృందం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రొమ్ము స్క్రీనింగ్, సర్వైకల్ కేన్సర్ పరీక్షలు చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ఇంతవరకు 1362 శిబిరాలు వేర్వేరు రాష్ట్రాలలో, బెంగళూరులో 6 శిబిరాలను నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో వికాస తరంగణి బెంగళూరు అధ్యక్షులు ఉషా జగదీశ్, అనుపమ, ట్రూత్ ల్యాబ్ డైరెక్టర్ అంజలి, ప్రముఖులు శ్రీకృష్ణ, మునిరాజ్, దీక్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు చేయూత



బీబీఎంపీ నుంచి లైసెన్సు పత్రాలు అందజేస్తున్న సంస్థ ముఖ్యులు

బొమ్మనహళ్ళి, జూన్ 16: స్థానిక కోడిచిక్కనహళ్ళి రోడ్డులోని ఫుట్‌పాత్ వ్యాపారస్తులకు హ్యూమన్‌రైట్స్ ఫెడరేషన్ సంస్థ అధ్యక్షుడు ఆదిల్‌బాషా ఆధ్వర్యంలో బీబీఎంపీ సహకారంతో 450మందికి కూరగాయలు, ఆహారం సమకూర్చారు. లైసెన్సు సదుపాయం కల్పించి వ్యాపారానికి వీలు కల్పించారు. తన పుట్టినరోజు సందర్భంగా ఫుట్‌పాత్ వ్యాపారస్తులకు అండగా నిలిచారు. ఫుట్‌పాత్ వ్యాపారస్తులకు బీబీఎంపీ నుంచి లైసెన్సు పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆదిల్ బాషాకు పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.